నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, శనివారం 10 ఫిబ్రవరి 2024 | ADILABAD

ఆటోలో అసెంబ్లీకి..

- వెళ్లిన బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

ఆటో ర్యాలీలో అసెంబ్లీకి వెలుతున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వ ఆటో యూనియన్‌కు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు నిర్వహించిన ఆటో యూనియన్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులందరికీ రూ. పదివేల సాయాన్ని వెంటనే అసెంబ్లీ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఇస్తానన్న పది లక్షల ఇన్సూరెన్స్ ను కూడా బడ్జెట్‌లో పొందుపరచాలన్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందని, లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటా

- బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

భైంసా, ఫిబ్రవరి 9: కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా ఉంటానని బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం భైంసా మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎలక్షన్లలో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పదవీకాలం ముగిసిన సర్పంచ్‌లను పూలమాల, శాలువాతో సన్మానించారు. నాయకులు సూర్యం రెడ్డి, సురేశ్, రాజేశ్, మాణిక్ రావు, గంగాధర్, సంజీవ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

నాగోబాకు మహాపూజ

అర్ధరాత్రి నిర్వహించిన మెస్రం వంశీయులు

- వైభవంగా మొదలైన జాతర
- తరలివచ్చిన భక్తజనం
- సంప్రదాయ వాయిద్యాలతో సందడి
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు

మర్రిచెట్ల వద్ద ఉన్న కోనేరు నుంచి పూజల కోసం మట్టికుండల్లో నీటిని తీసుకు వస్తున్న మహిళలు

ఖాలికోం వాయిస్తున్న మెస్రం వంశీయుడు

కిక్రి వాయిస్తూ పాటల ద్వారా నాగోబా చరిత్రను వివరిస్తున్న మెస్రం వంశీయుడు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 9: ఇంద్రవెల్లి మండలంలోని కెస్లాపూర్‌లో తమ ఆరాధ్య దైవమైన నాగోబాకు మెస్రం వంశీయులు శుక్రవారం అర్ధరాత్రి మహాపూజలు నిర్వహించారు. దీంతో నాగోబా జాతర వైభవంగా ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం 11గంటల నుంచి రాత్రి 12గంటల వరకు సంప్రదాయ ప్రత్యేక పూజలు అద్భుతంగా సాగాయి. ఈనెల 15వ తేదీ వరకు జాతర కొనసాగుతుందని నాగోబా ఈవో రాజమౌళి తెలిపారు. తరలివచ్చిన భక్తజనంతో నాగోబా ఆలయం కిక్కిరిసిపోయింది.

ప్రత్యేక పూజలు..

గంగాజలంతో ఐదు రోజులుగా మర్రిచెట్లవద్ద బసచేసిన మెస్రం వంశీయులు ముందుగా అక్కడే సంప్రదాయ పూజలు చేశారు. అనంతరం కెస్లాపూర్‌లోని పురాతన(మురాడి)నాగోబా ఆలయానికి చేరుకొని సంప్రదాయ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన నాగోబా విగ్రహంతోపాటు వెలిగించిన దీపాలను వెదురుబుట్టలో పెట్టి భారీ శోభాయాత్రగా నాగోబా ఆలయానికి చేరుకున్నారు. నాగోబా ఆలయం ముందున్న మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన నాగోబా విగ్రహాలతోపాటు నాగోబా దేవత, సతీదేవత, బాన్‌దేవతకు సంప్రదాయ పూజలు చేశారు. పురాతన నాగోబా విగ్రహాన్ని గర్భగుడిలోని నాగోబా విగ్రహం వద్ద ఉంచారు. బాన్‌దేవతలతోపాటు పెర్సపేన్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి నాగోబా ఆలయంలోకి వచ్చారు.

గోవాడ్‌లో మహిళలకు ప్రవేశం..

మర్రిచెట్ల నుంచి మెస్రం వంశీయులు ఎడ్లబండ్లతో కుటుంబ సమేతంగా సంప్రదాయ ప్రకారం నాగోబా ఆలయానికి చేరుకొని, మహిళలకు గోవాడ్‌లో ప్రవేశం కల్పించారు. గోవాడ్ చుట్టూ తమ ఎడ్లబండ్లను వదిలి ప్రత్యేక గుడారాలు ఏర్పాటు చేసుకొని బసచేస్తున్నారు. గోవాడ్‌లో ప్రవేశించిన మహిళలు 22 ప్రత్యేక పొయ్యిలను ఏర్పాటు చేసుకొని మహాపూజలకు అవసరమైన నైవేద్యాన్ని సామూహికంగా తయారు చేశారు. మహాపూజలకు ఆరగంట ముందు నాగోబా ఆలయాన్ని గంగాజలంతో శుద్ధి చేశారు. రాత్రి 10 గంటల తర్వాత మెస్రం వంశీయులు గోవాడ్ నుంచి వెలిగించిన కాగడాలను చేతిలో పట్టుకొని సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ నాగోబా ఆలయానికి చేరుకున్నారు. నాగోబా ఆలయంలో మహాపూజలు నిర్వహించేటప్పుడు ఇతరులను లోనికి రానివ్వకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. మహాపూజల అనంతరం ప్రముఖులతోపాటు అతిథులు, ఇతరులకు నాగోబాకు పూజలు చేసేందుకు అవకాశం కల్పించారు.

నాగోబా ఆలయానికి తరలివచ్చిన మెస్రం వంశీయులు

22 కితలకు మట్టికుండల పంపిణీ..

నాగోబా ఆలయం వెనుక ఉంచిన మట్టికుండలను 22కితలకు చెందిన మహిళలకు మెస్రం వంశీయుల పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు. మహాపూజలకు ఉపయోగించుకునే మట్టికుండలకు కటోడ కోసేరావ్, కోసు కటోడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీటితో మహిళలు మర్రిచెట్లవద్ద ఉన్న పురాతన బావి(నీటికోనేరు)కు చేరుకున్నారు. కోనేరుకు సంప్రదాయ ప్రత్యేక పూజలు చేశారు. మెస్రం వంశీయుల అల్లుళ్లు నీటి కోనేరు ద్వారా నీటిని తోడి మట్టికుండల్లో నింపారు. ఆ కుండలను మహిళలు తలపై పెట్టుకొని వరుసగా నాగోబా ఆలయానికి చేరుకున్నారు. నాగోబా ఆలయంలోని పాత పాముల పుట్టలను అల్లుళ్లు తవ్వి తొలగించారు. అదే మట్టిను మహిళలు తెచ్చిన నీటితో అల్లుళ్లు బురదమట్టి చేసిచ్చారు. మహిళలందరూ కలిసి ఆ మట్టితో పాముల పుట్టలను తయారు చేశారు. అదే మట్టితో మరికొంత మహిళలు నాగోబా ఆలయంలో బొలదేవతను తయారు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన మొక్కులు చెల్లించుకున్నారు. బొలదేవత పూజల్లో పాల్గొన్న మహిళలకు మెస్రం వంశీయులకు నాగోబా చరిత్రను మెస్రం గంగారాం, రాము కిక్రి వాయిస్తూ పాటల ద్వారా వివరించారు.

తరలివస్తున్న అడవిబిడ్డలు..

తమ ఆరాధ్యదైవాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతరలో వివిధ రకాల దుకాణాలు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, బాజీరావ్‌పటేల్, లింబారావ్‌పటేల్, జంగుపటేల్, కటోడ కోసు, కటోడ కోసేరావ్, పర్ధాంజీ దాదారావ్, పేన్ కొత్వాల్ మెస్రం తిరుపతి, నాయిక్‌వాడీ ధర్ము, మెస్రం వంశీయులు మనోహర్, దేవ్‌రావ్, సోనేరావ్, నాగ్‌నాథ్, శేఖర్‌బాబు, తుకారాం, ఆనంద్‌రావ్, ఆలయ పూజారి మెస్రం షేకు, గణపతి, మారుతి, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

నిఘాలో కెస్లాపూర్

జాతర కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.దర్బార్‌హాల్‌లో ప్రజల నుంచి ఐటీడీఏ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతరలోని విద్యుత్ స్తంభాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్నారు. డీఎల్పీవో భిక్షపతిగౌడ్, ఐటీడీఏ మేనేజర్ రాంబాబు, ఎస్ఐ డీ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

బొలదేవతకు పూజలు చేస్తున్న మెస్రం మహిళలు

పంపిణీ చేసిన మట్టికుండలను తీసుకెళ్తున్న మహిళలు

తెలుగు తేజం..మన పీవీ

- సముచిత స్థానం కల్పించిన కేసీఆర్ సర్కారు
- ఏడాదంతా శతజయంతి ఉత్సవాలు
- భారతరత్న ప్రకటించడంపై సర్వత్రా హర్షం

పీవీ నర్సింహారావు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు భారత జాతి ఖ్యాతిని ప్రపంచదేశాలకు చాటిచెప్పారు. రుక్మాబాయమ్మ, సీతారామారావు దంపతులకు 28.06.1921లో జన్మించారు. ఈయన భార్య సత్తెమ్మ. వీరికి ముగ్గురు కొడుకులు, ఐదుగురు కూతుళ్లు. వరంగల్ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం మొదలు పెట్టారు. హన్మకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. కళాశాల చదువుకోసం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరారు. అక్కడ వందేమాతరం ఆలపించడంతో సహచరుల తోపాటు పీవీని విశ్వవిద్యాలయం నుంచి అప్పటి నిజాం ప్రభుత్వం బహిష్కరించింది. నిజాం ఏలుబడిలోని ఏ ప్రాంతంలోనూ చదివేందుకు వీలు లేదని అప్పటి ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించారు. బీఎస్సీ, ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. హైదరాబాద్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్ న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. అనంతరం ఊహించని పరిణామాలు చోటుచేసుకోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయ్యారు. పీవీ తన సన్నిహితుడు పాములపర్తి సదాశివరావుతో కలిసి 1944లో కాకతీయ పత్రికను వరంగల్‌జిల్లాలో స్థాపించారు. 1946–1955 వరకు వారపత్రికను కొనసాగించారు.

కేసీఆర్ సర్కారులో గుర్తింపు

పీవీ 2004 డిసెంబర్ 23న 83వ యేట మరణించారు. మరణానంతరం ఆయనను స్మరించుకోవడంలో కాంగ్రెస్ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. జయంతి, వర్ధంతి రోజుల్లో కూడా ఇదే వివక్ష చూపారు. గల్లీ లీడర్లకు సైతం విగ్రహాలు పెట్టే నేతలు పీవీ విషయంలో మాత్రం స్పందించలేదు. కనీసం విగ్రహాలు కూడా ఆవిష్కరించుకోలేదు. కానీ, 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పీవీకి తగిన గుర్తింపునిచ్చింది. కేసీఆర్ ఆదేశాల మేరకు ఆయన జయంతి వేడుకలను ఏటా అధికారికంగా నిర్వహించారు.

ఉమ్మడి జిల్లా ప్రజల హర్షం

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్నను ప్రకటించింది. తెలుగుబిడ్డ పీవీకి దేశంలోని అత్యున్నతమైన పురస్కారం ప్రకటించడంపై ఉమ్మడి జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భారత ప్రధానిగా తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటి చెప్పిన మహా మేధావి.. మన పీవీ అని కొనియాడుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆశ కార్యకర్తల డిమాండ్

ఎదులాపురం,ఫిబ్రవరి 9: పెండింగ్‌లో ఉన్న పారితోషికాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలతో ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న మాట్లాడుతూ. రెండు నెలలుగా ఆశ కార్యకర్తలకు పారితోషికాలు రాక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పని భారం కూడా పెరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు నైతంశోభ, సుజాత, రాధ, జ్యోతి, ఆశా, మాధవి, పుష్పలత, పార్వతి, తదితరులున్నారు.

నిర్మల్‌లో..

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 9: ఆశ వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. 11 గంటలకు కార్యాలయానికి చేరుకున్న ఆశ కార్యకర్తలు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. అనంతరం డీఆర్వో లోకేష్‌ను కలిసి వినతిపత్రం అదించారు. సీఐటీయూ నాయకులు సురేశ్ , సుజాత, రాంలక్ష్మణ్, ఇంద్రమాల, విజయ, అనసూయ, కమల, స్వప్న, నంద, సరిత, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో డీఆర్వో లోకేశ్వర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆలయంలో ధర్నా చేస్తున్న సిబ్బంది

జీతాలు మహాప్రభో..

బాసరలో ఎన్ఎంఆర్‌లు.. ఉట్నూర్‌లో ఔట్ సోర్సింగ్ సిబ్బంది నిరసన

బాసర, ఫిబ్రవరి 9: తమకు నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదంటూ బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ ఎన్ఎంఆర్ సిబ్బంది సుమారు 83 మంది శుక్రవారం బాసర ఆలయ ఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాగ్దేవి లేబర్ సొసైటీని రద్దు చేసి దేవస్థాన ఉద్యోగులుగా తమను గుర్తించి జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బాసర ఆలయంలో హోంగార్డులను తొలగించి వాగ్దేవి సిబ్బందిలో అర్హులైన వారిని జాయిన్ చేసుకోవాలని డిమాండ్ చేశారు. దేవాదాయశాఖ కమిషనర్‌తో మాట్లాడి ఎన్ఎంఆర్ ఉద్యోగుల సమస్యలను తీరుస్తామని ఆలయ ఈవో తెలిపారు.

ఉట్నూర్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు..

ఉట్నూర్, ఫిబ్రవరి 9: మూడు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉట్నూర్ ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు సుభాష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ దవాఖానలో రెండో రోజు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవాఖానలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ, జీతాలు సకాలంలో రావడం లేదన్నారు. అనంతరం ఆర్ఎంవో మహేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జ్యోత్స్న, మహేశ్, వీణ, సూర్య, నర్మద, భాను ప్రసాద్, అరుణ్, పరుశురాం, వెంకటేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 24.8 కిలోల గంజాయి, రూ. 40వేలు, పది సెల్ ఫోన్లు, మూడు వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిల

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకిషర్మిల

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 9: హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను గురువారం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. వివరాలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన మహ్మద్ ఇలియాస్, పందెన నిఖిల్, మెదక్ జిల్లా వటపల్లి గ్రామానికి చెందిన మెగావత్ రాజు, మహారాష్ట్రకు చెందిన షేక్ ఇమ్రాన్, షేరు షాదిక్ షేక్, బావులాల్ దేవ్‌చాంద్ జార్దే, ఒడిశా పిలకుస్మి గ్రామానికి చెందిన ప్రపూర్ కుమార్ ఖిల్లా ముఠాగా ఏర్పడ్డారు. వీరు ఒడిశాలోని మల్కానిగిరి జిల్లాకు చెందిన వ్యక్తి దగ్గర వారం రోజుల కింద 50 కిలోల గంజాయిని కిలోకు రూ.3 వేల చొప్పున కొన్నారు. గతంలో వీరు వివిధ కేసుల్లో నిందితులు కాగా, జైల్లో పరిచయమై ముఠాగా ఏర్పడ్డారు. ఈ క్రమంలో పోలీసులకు అందిన సమాచా రం మేరకు డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ చంద్రమోహన్ కొండాపూర్ వద్ద రెండు స్కోడా కార్లు, బోలెరో వాహనాన్ని తనిఖీ చేయగా 24.8 కిలోల గంజాయిని పట్టుకున్నారు. దీని విలు వ రూ. 6.20 లక్షలు ఉంటుందని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.40 వేలు,పది సెల్ ఫో న్లు, మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, ఏడుగురిని కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ వీరికి రిమాండ్ విధించారు.

'దిండు' కోసమే గొడవ

- విద్యార్థి మృతికి అదే కారణం
- చించోలి(బీ) మైనార్టీ గురుకులం ఘటనలో నలుగురిపై కేసు
- ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు

ఆర్బన్ (ఫైల్)

సారంగాపూర్, ఫిబ్రవరి 9: సారంగాపూర్ మండలం చించోలి(బీ) మైనార్టీ బాలుర గురుకుల విద్యాలయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణలో ఒకరు మృతి చెందిన విషయం విదితమే. రాత్రి భోజనం తర్వాత పడుకునే సమయంలో దిండు విషయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. నిర్మల్ పట్టణం గాజులోపేట్‌కు చెందిన ఆఫాన్, ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం మన్యాల్ గ్రామానికి చెందిన అర్బాన్‌ల మధ్య గొడవ జరిగింది. ఇద్దరూ విచక్షణరహితంగా కొట్టుకున్నారు. ఈ క్రమంలో అర్బన్ కిందపడడంతో ఆఫాన్ కాళ్లతో తన్నడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో సెక్యూరిటీ గార్డు , నైట్‌డ్యూటీ ఉపాధ్యాయులు కలిసి అర్బన్‌ను నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కాగా ఈ ఘటనలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యవైఖరిపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ప్రిన్సిపాల్ మహేశ్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు సమాచారం. రాత్రి విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులు రమేశ్, ఆర్తి, అస్మారా, విద్యార్థి ఆఫాన్‌పై కూడా కేసు నమోదు చేశారు. కాగా అర్బాన్ తల్లిదండ్రులు, బంధువులు దవాఖాన వద్ద ఆందోళనకు దిగారు. దీంతో అర్బాన్ తండ్రికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చేందుకు ఉన్నతాధికారులు హామీ ఇచ్చినట్లు ప్రకటించడంతో ఆందోళన విరమించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ఎస్ఐ కృష్ణసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

వన్యప్రాణులకు ఇబ్బందుల్లేకుండా చూడండి

-ఉడుంపూర్ అడవుల్లో ఎన్‌టీసీఏ టీమ్

కడెం, ఫిబ్రవరి 9: వన్యప్రాణుల సంరక్షణకు మరింత చర్యలు తీసుకోవాలని ఎన్‌టీసీఏ సెక్యూరిటీ ఇన్‌స్పెక్షన్ టీమ్, ఐఎఫ్ఎస్ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ అలోక్‌కుమార్, అరుణాచల్ ప్రదేశ్ ఐఎఫ్ఎస్ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ యోగేశ్ అన్నారు. మండలంలోని ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని పలు అటవీ ప్రాంతాలను స్థానిక అధికారులతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కల్పకుంట ప్రాంతంలో పక్షులను తిలకించారు. వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన గడ్డి క్షేత్రాన్ని సందర్శించారు. అటవీ ప్రాంతంలోని వాచ్‌టవర్, వన్యప్రాణుల సంరక్షణకు ఏర్పాటు చేసిన సాసర్‌ఫీట్స్, బోర్‌లను పరిశీలించారు. ఉడుంపూర్ రేంజ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అయితే కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలో అటవీ సంరక్షణకు పాటు పడుతున్న అధికారుల పనితీరును గుర్తించిన ఐఎఫ్ఎస్ అధికారులు వన్యప్రాణుల సంరక్షణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. అక్కడి నుంచి 'ఐ లవ్ కవ్వాల్ టైగర్ రిజర్వు' లోగో వరకు చేరుకొని అధికారులు ఫొటోలు దిగారు. నిర్మల్ డీఎఫ్‌వో రాంకిషన్, ఖానాపూర్ ఎఫ్‌డీవో భవాని శంకర్, ఉడుంపూర్ ఎఫ్ ఆర్వో డీ ప్రభాకర్, డీఆర్వో ప్రకాశ్, సిబ్బంది, తదితరులున్నారు.

కవ్వాట్ టైగర్ లోగో వద్ద ఐఎఫ్ఎస్ అధికారులు

16,45,720

ఆదిలాబాద్ పార్లమెంట్ ఓటర్ల సంఖ్య

- మహిళలు 8,41,250
- పురుషులు 8,02,267

ఆదిలాబాద్, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ): ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. కొత్త జాబితా ప్రకారం ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో 16,45,720 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. పార్లమెంట్ పరిధిలో పురుషుల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. కాగా 8,02,267 మంది పురుషులు కాగా, 8,41,251 మంది మహిళలు ఉన్నారు. ఇతరులు 87 మంది, సర్వీస్ ఓటర్లు 2116 మంది ఉన్నారు. నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎక్కువగా 2,56,389 మంది, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గంలో తక్కువగా 2,11,466 మంది ఉన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 2,29,145, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2,26,695, ఖానాపూర్ నియోజకవర్గంలో 2,24,380, ఆదిలాబాద్ నియోజకవర్గంలో 2,43,768, మథోల్ నియోజకవర్గంలో 2,53,876 మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు జాబితా సవరణ ఎస్ఎస్ఆర్ 2024 తుది ఓటరు జాబితా తయారీలో భాగంగా జనవరి 22 వరకు జాబితాపై అభ్యంతరాల స్వీకరణతో పాటు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 2 లోగా అభ్యంతరాలు, క్లెమ్స్ పూర్తిస్థాయిలో పరిష్కరించి 8న తుది జాబితా ప్రకటించారు. నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 9: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. నిర్మల్ జిల్లాలో నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాలుండగా మొత్తం 923 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు వివరించారు. మొత్తం 7,33,717 ఓటర్లు కాగా అందులో పురుషులు 3,53,786, స్త్రీలు 3,79,880, థర్డ్ జెండర్లు 51, ఎన్ఆర్ఐ ఓటర్లు 21, సర్వీసు ఓటర్లు 927 మంది ఉన్నట్లు తెలిపారు. ఓటరు జాబితాపై వచ్చిన అర్జీలను పరిష్కరించి తుది ఓటరు జాబితాను ఖరారు చేసినట్లు చెప్పారు.